సమావేశమైన ఉమ్మడి జిల్లా వ్యాప్త అడిషనల్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

నూతన చట్టాలపై అవగాహన కల్పించాలి

డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వెంకటేశ్వర్లు

కోర్టుచౌరస్తా, జూన్ 15 : ఇటీవల కేంద్రం మార్పులు చేర్పులతో ప్రవేశపెట్టిన నూతన చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వింజమూరి వెంకటేశ్వర్లు తెలిపారు. తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అడిషనల్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం జిల్లా కోర్టు ఆవరణలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి మొదటి శనివారం పోలీస్ అధికారుల సమీక్షా సమావేశంలో వారికి నూతన చట్టాలపై అవగాహన కల్పించాలని, ప్రతి మూడో శనివారం ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశంలోనూ వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రాసిక్యూటర్లు కేసుల విచారణ సమయంలో ఆయా కేసులపై పూర్తి అవగాహనతో ఉండాలని, సంబంధిత న్యాయమూర్తులతో సమన్వయంతో కలిసి వెళ్లాలన్నారు. అనంతరం పెద్దపల్లి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీ రాకేశ్ నూతన చట్టాల గురించి వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జ్యోతిరెడ్డి, లక్ష్మీప్రసాద్, నర్సింగరావు, జూలూరు శ్రీరాములు, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, శరత్, పెంట శ్రీనివాస్, కాసారం మల్లేశం, జంగిలి మల్లికార్జున్, సీనియర్ ఏపీపీ మురళీధర్‌రావు, వసంత పాల్గొన్నారు.

ఉపాధి కరువై.. బతుకు భారమై

బొల్లబత్తిని వెంకటేశం (ఫైల్)

- కొత్తపల్లిలో నేతన్న ఆత్మహత్య
- పదేండ్లు చేతినిండా పనితో ఆనందంగా గడిపిన కుటుంబం
- ఆరు నెలలుగా పనిలేక సతమతం
- కుటుంబపోషణ కష్టమై బలవన్మరణం
- తమను ప్రభుత్వమే ఆదుకోవాలని భార్యా, బిడ్డల వేడుకోలు

నేత కార్మికలోకం తల్లడిల్లుతున్నది. వస్త్ర పరిశ్రమలో సంక్షోభం ఊపిరి సలపకుండా చేస్తున్నది. ఆర్డర్లు ఇవ్వక, ఉపాధి మార్గాలు లేక ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యం నేతన్నల ప్రాణాలు తీస్తున్నది. గత పదేండ్లుగా చేతినిండా పనితో ఏ బాధాలేకుండ బతికిన కార్మికులు, ఆరు నెలలుగా ఉపాధి కరువై, బతుకుభారమై చితికిపోతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవలే సిరిసిల్లలో పలువురు బలవన్మరణాలకు పాల్పడగా, తాజాగా కరీంనగర్ జిల్లా కొత్తపల్లి పట్టణంలో మరో కార్మికుడు ప్రాణాలు తీసుకోవడం కలకలం రేపింది. ఎదిగొచ్చిన కొడుక్కు దారి చూపలేక, బిడ్డ పెండ్లి ఎలా చేయాలో తెలియక మనస్తాపం చెంది నేతన్న బొల్లబత్తిని వెంకటేశం ఆత్మహత్య చేసుకోగా, ఆ కుటుంబానికి తీరని దుఃఖమే మిగిలింది.

కొత్తపల్లి, జూన్ 15: కొత్తపల్లి పట్టణంలోని రెడ్డిరామయ్యపల్లిలో నివాసం ఉండే బొల్లబత్తిని వెంకటేశం(63)కు భార్య ఇందిర, కొడుకు రంజిత్, కూతురు సౌమ్య ఉన్నారు. భార్య ఇంటి వద్దనే ఉంటుండగా, కొడుకు బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం అన్వేషిస్తున్నాడు. కూతురు సౌమ్య ఎంబీఏ చదువుతున్నది. తెలంగాణ రాక ముందు ఇక్కడ ఉపాధి లేక కొన్నేండ్లపాటు భీవండి వెళ్లి పనిచేశాడు. స్వరాష్ట్రం వచ్చాక ఏర్పడిన ప్రభుత్వం నేత కార్మికులకు ఉపాధి మార్గం పెరగడంతో భీవండి వదిలి సిరిసిల్లకు వచ్చి ఉపాధి పొందుతున్నాడు. పదేళ్లుగా పవర్‌లూం కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వారంలో ఆరు రోజులపాటు పనిచేసి ఆదివారం ఇంటికి వచ్చి వెళ్తుండేవాడు. అయితే కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి తారుమారైంది. సర్కారు నుంచి ఆర్డర్లు లేక, ప్రోత్సాహం లేక సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభం తలెత్తింది. మరమగ్గాలు సరిగ్గా నడువక చేతినిండా పనిదొరుకడం కరువైంది. ప్రతి రోజూ సిరిసిల్లకు వెళ్తూ ఏ పని దొరక్క తిరిగి వచ్చేవాడు. ఈ పరిస్థితుల్లో భార్యా పిల్లలను ఎలా పోషించేదని? ఆందోళన చెందాడు. కుటుంబం రోడ్డున పడే పరిస్థితికి వచ్చిందని మనస్తాపం చెందాడు. ఈ క్రమంలోనే శుక్రవారం సాయంత్రం పని కోసం సిరిసిల్ల వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి బయలు దేరిన వెంకటేశం, కొత్తపల్లి రైల్వే స్టేషన్ పట్టాలపై పడుకొని ప్రాణాలు తీసుకున్నాడు. శనివారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని రైల్వే పోలీసులు చెబుతున్నారు. జేబులో ఉన్న ఆధార్‌కార్డుతో అడ్రస్ గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

కుటుంబసభ్యులకు తీరనిదుఃఖం

ఇంటికి పెద్దదిక్కైన వెంకటేశం ఆత్మహత్య చేసుకోవడంతో కటుంబానికి తీరని దుఃఖం మిగిలింది. 'పనికి పోయాస్తానని చెప్పి అటే పోతివా' అంటూ కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. 'ఇక మాకేవరు దిక్కు? బిడ్డ పెళ్లి ఎలా చేసేది? కొడుకును ప్రయోజకుడిగా ఎవరు చేస్తరు?' అంటూ భార్య ఇందిర రోదించిన తీరు కంటతడి పెట్టింది. గత పదేళ్ల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గడిపామని, ఆరు నెలలుగా పనిలేక పోవడంతో తన భర్త నిత్యం మదనపడుతూ ఉండేవాడని, ఇప్పుడు మమ్మల్ని ఆగం చేసి పోయిండని బోరున విలపించింది.

క్రీడా పాఠశాలలు పిలుస్తున్నయ్

- చేరికలకు దరఖాస్తుల ఆహ్వానం
- రాష్ట్రంలోని మూడు పాఠశాలల్లో 120 సీట్లు
- 21 నుంచి 25 వరకు మండల స్థాయి ఎంపిక పోటీలు
- 27 నుంచి జిల్లా స్థాయి ఎంపిక : డీవైఎస్‌వో

డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి

కొత్తపల్లి, జూన్ 15: జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు క్రీడా పాఠశాలలు ఎంతో దోహదం చేస్తాయి. క్రీడా పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉన్నతంగా స్థిరపడిన వారు ఎందరో ఉన్నారు. ఈ క్రమంలో 2024-25 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని మూడు క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాల కోసం అర్హుల నుంచి సర్కారు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది. దీనికి సంబంధించిన వివరాలను కరీంనగర్ జిల్లా యువజన, క్రీడాశాఖాధికారి బీ శ్రీకాంత్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని మూడు క్రీడా పాఠశాలల్లో చేరికలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం మూడో తరగతి పాసైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎంపిక పోటీలు మూడు స్థాయిల్లో ఉంటాయని, మొదట మండల స్థాయి, తర్వాత జిల్లా స్థాయి, ఇందులో ఎంపికైన వారికి రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ముందుగా మండల స్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 21 నుంచి 25 వరకు ఉంటాయన్నారు. ఈ విభాగంలో విద్యార్థులకు ఏడు ఈవెంట్‌లలో పోటీలు నిర్వహిస్తామని, ఇందులో అర్హులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 27 నుంచి జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తామని, ఇందులో అర్హత సాధించిన వారిని రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు. ఒక్కో క్రీడా పాఠశాలలో 20 మంది బాలికలు, 20 మంది బాలురు మొత్తంగా 120 మందిని రాష్ట్రంలోని మూడు క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 2015 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారై ఉండాలని, ఇతర వివరాలకు అంబేద్కర్ స్టేడియంలో సంప్రదించాలని సూచించారు.

హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

నేడు ఉచితంగా కృత్రిమ అవయవాల పంపిణీ

హిమాయత్‌నగర్, జూన్15 : ప్రమాదవశాత్తు ఏదైనా అవయవం కోల్పోయి దివ్యాంగులుగా మారిన వారు అవస్థ పడవద్దనే సంకల్పంతో ఈ నెల 16న ఆదివారం హైదరాబాద్ కింగ్ కోఠిలోని ఈడెన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆర్టిఫిషియల్ లింబ్, కాలిఫర్స్, ఫిట్‌మెంట్‌తో పాటు కృత్రిమ అవయవాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు నారాయణ్ సేవా సంస్థాన్ ట్రస్టీ డైరెక్టర్ దేవేంద్ర చౌబిసా, కో-ఆర్డినేటర్ అల్కా చౌదరి తెలిపారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతులు, కాళ్లు కోల్పోయి దివ్యాంగులుగా మారి దుర్భర జీవితం గడుపుతున్న వారికి విముక్తి కల్పించాలనే ఉద్దేశంతో 39 ఏళ్లుగా సంస్థ కృషి చేస్తుందన్నారు. 2024 ఫిబ్రవరి 4న 1500 మందికి కొలతలు తీసుకోగా, వీరిలో 800 మందికి కృత్రిమ అవయవాలను అందజేస్తున్నామని తెలిపారు. సమావేశంలో సామాజిక వేత్త రితేష్ జగీర్ధార్, సంస్థ ప్రతినిధులు ఉత్తమ్‌దామ్రూణి, మహేంద్ర సింగ్ రావత్, జస్మిత్ పటేల్, భగవాన్ ప్రసాద్‌గౌర్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల చట్టంపై అవగాహన పెరగాలి

మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్స్ ఫోరం రాష్ట్ర ప్రతినిధి ఉచ్చిడి మోహన్‌రెడ్డి

కలెక్టరేట్, జూన్ 15 : సీనియర్ సిటిజన్ చట్టాలపై పోలీసుల్లో అవగాహన పెరుగాల్సిన అవసరముందని మాజీ ఎమ్మెల్యే, సీనియర్ సిటీజన్స్ ఫోరం రాష్ట్ర ప్రతినిధి ఉచ్చిడి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నగరంలోని కిమ్స్ కళాశాలలో వృద్ధులకు సీనియర్ సిటిజన్ల చట్టాలపై నిర్వహించిన అవగాహన శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. వయోవృద్ధులు తమ పిల్లలతో ఇబ్బందులకు గురవుతూ సాయం కోరితే, వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే ముఖ్యఅతిథిగా హాజరైన కిమ్స్ విద్యాసంస్థల అధినేత పేర్యాల రవీందర్‌రావు, ఫోరం అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో పెన్షనర్స్ భవన్ అధ్యక్షుడు మోసం అంజయ్య, సెంట్రల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెండ్యాల కేశవరెడ్డి, తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు పోరెడ్డి కేశవరెడ్డి, తొడుపునూరి ఆనందం, గడప కోటేశ్, జగదీశ్వర్‌గౌడ్, కొడూరి సత్యనారాయణ, ఉప్పల లక్ష్మయ్య, వీ వెంకటేశం, ముదుగంటి నర్సింహారెడ్డి, చింతల సత్యనారాయణ, బోయినపల్లి రాజగోపాల్‌రావు, గాలిపల్లి శంకరయ్య, యాస్వాడ చంద్రమౌళి, సత్యనారాయణరాజు, జీ శంకరానంద్, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ సేవలు

వెలవెలబోతున్న గంగాధర సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం

గంగాధర, జూన్ 15: గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కార్యాలయంలోని ఇన్వర్టర్ మదర్‌బోర్డు కాలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీనికి తోడు చిన్న వర్షానికే విద్యుత్ శాఖ అధికారులు గంటల తరబడి విద్యుత్ సరఫరాను నిలిపివేయడం, కార్యాలయంలో ఉన్న జనరేటర్ పని చేయకపోవడంతో రిజిస్ట్రేషన్ సేవలు స్తంభించాయి. రెండు రోజులుగా కరెంటు సరఫరా లేకపోవడంతో రిజిస్ట్రేషన్‌కు కోసం వచ్చిన వారు నిరాశగా వెనుదిరిగారు. కాగా, ఆదివారం, సోమవారం సెలవు దినాలు కావడంతో మంగళవారమైన విద్యుత్ సమస్యను పరిష్కరించి రిజిస్ట్రేషన్ సేవలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

వాణిజ్య

నెక్సాన్‌పై లక్ష రూపాయల ఆఫర్

ముంబై, జూన్ 15: ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్‌కి చెందిన ఎస్‌యూవీ నెక్సాన్ మరో మైలురాయిని అధిగమించింది. దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చి ఏడేండ్లు పూర్తైన సందర్భంగా ఈ వాహనంపై ప్రత్యేక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు ప్రకటించింది. 2017 నుంచి 2024 వరకు ఏడేండ్లలో ఏడు లక్షల యూనిట్ల వాహనాలను విక్రయించినట్లు కంపెనీ చీఫ్ కమర్షియల్ అధికారి వివేక్ శ్రీవాత్సవ తెలిపారు. డిజైనింగ్, భద్రత, కంఫర్ట్, సులభంగా డ్రైవింగ్ చేసే వీలుగా డిజైనింగ్ చేయడం వల్లనే ఈ మాడల్‌కు కస్టమర్ల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.

విజయవాడ-ముంబై ఎయిర్ ఇండియా ఫ్లైట్

మచిలీపట్నం, జూన్ 15: విజయవాడ నుంచి ముంబైకి డైరెక్ట్ విమాన సేవలు ప్రారంభించింది ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్. గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ విమాన సేవలు శనివారం ప్రారంభించారు. ముంబైలో మధ్యాహ్నం 3.55 గంటలకు బయలుదేరనున్న ఏ-320 విమాన సర్వీసు విజయవాడకు సాయంత్రం 5.45కి చేరుకోనున్నది. తిరుగు ప్రయాణంలో విజయవాడలో 7.10 గంటలకు బయలుదేరి ముంబైకి రాత్రి 9 గంటలకు చేరుకోనున్నది.

ఇంధనాలపై విండ్‌ఫాల్ ట్యాక్స్ తగ్గింపు

న్యూఢిల్లీ, జూన్ 15: ఇంధనాలపై విధించే విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను కేంద్ర ప్రభుత్వం మరోసారి తగ్గించింది. టన్ను క్రూడాయిల్‌పై విధించే విండ్‌ఫాల్ ట్యాక్స్‌ని రూ.5,200 నుంచి రూ.3,250కి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. తగ్గించిన రేట్లు శనివారం నుంచి అమలులోకి వచ్చాయి. తొలిసారిగా కేంద్ర ప్రభుత్వం ఈ విండ్‌ఫాల్ ట్యాక్స్‌ని జూలై 1, 2022న విధించిన విషయం తెలిసిందే.

ఎస్బీఐ వడ్డీరేట్ల పెంపు

ఎంసీఎల్ఆర్‌ని 10 బేసిస్ పాయింట్లు పెంచిన బ్యాంక్

నూఢిల్లీ, జూన్ 15: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రుణ గ్రహీతలకు షాకిచ్చింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని 10 బేసిస్ పాయింట్లు పెంచింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో వాహన, గృహ రుణాలపై చెల్లింపులు మరింత భారంకానున్నాయి. శనివారం నుంచి అమలులోకి వచ్చిన ఈ రుణాల్లో ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్ రేటు 8.65 శాతం నుంచి 8.75 శాతానికి సవరించింది. వాహన రుణాలు ఏడాది కాలపరిమితితో, వ్యక్తిగత రుణాలు రెండేండ్ల కాలపరిమితితో మంజూరు చేస్తున్నది బ్యాంక్. దీంతో బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటు 8.10 శాతం నుంచి 8.95 శాతం మధ్యలో లభించనున్నాయి.

ఎఫ్‌డీలపై కూడా..

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేటును బ్యాంక్ సవరించింది. గతంలో రూ.2 కోట్ల లోపు డిపాజిట్లపై వడ్డీరేటును పెంచిన ఎస్బీఐ..తాజాగా రూ.3 కోట్ల లోపు డిపాజిట్లపై వడ్డీరేటును 75 బేసిస్ పాయింట్ల వరకు సవరించింది. ఏడు రోజుల నుంచి 45 రోజుల లోపు డిపాజిట్లపై వడ్డీని 3.5 శాతం నుంచి 4 శాతానికి, 46 రోజుల నుంచి 179 రోజుల వడ్డీరేటు 5.5 శాతం నుంచి 6 శాతానికి, 180-210 రోజుల లోపు ఎఫ్‌డీలపై 6.75 శాతానికి, 211 రోజుల నుంచి ఏడాది లోపు ఎఫ్‌డీలపై వడ్డీని 6.5 శాతం నుంచి 7 శాతానికి సవరించింది. అలాగే ఏడాది నుంచి రెండేండ్ల లోపు టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేటును 6.8 శాతం నుంచి 7.3 శాతానికి, 2 ఏండ్ల నుంచి మూడేండ్ల లోపు కాలపరిమితి డిపాజిట్లపై వడ్డీని 7.5 శాతానికి పెంచింది. మూడేండ్ల నుంచి ఐదేండ్ల లోపు డిపాజిట్లపై వడ్డీరేటును 6.75 శాతం నుంచి 7.25 శాతానికి సవరించిన బ్యాంక్, ఐదేండ్ల నుంచి 10 ఏండ్లలోపు డిపాజిట్లపై వడ్డీరేటును 7.50 శాతానికి పెంచింది.

మరో ఐదు బ్యాంకులు కూడా..

ఎస్బీఐతోపాటు మరో ఐదు బ్యాంకులు ఎంసీఎల్ఆర్ రేట్లను సవరించాయి. వీటిలో హెచ్‌డీఎఫ్‌సీ, యెస్ బ్యాంక్, కెనరా, పీఎన్‌బీ, ఐడీబీఐ బ్యాంకులు ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎంసీఎల్ఆర్‌ని 5 బేసిస్ పాయింట్లు సవరించింది. దీంతో రుణాలపై వడ్డీ రేటు 9 శాతం నుంచి 9.35 శాతం మధ్యలోకి చేరాయి. అలాగే యెస్ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటు 9.25 శాతం నుంచి 10.60 శాతం మధ్యలో ఉండగా, కెనరా బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటు 8.15 శాతం నుంచి 9.30 శాతంలోకి, పీఎన్‌బీ రేటు కూడా 8.25 శాతం నుంచి 9.10 శాతం మధ్యలో వసూలు చేస్తున్నది. అలాగే ఐడీబీఐ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటు 8.35 శాతం నుంచి 10 శాతం లోపు నిర్ణయించింది.

బ్యాంక్ ఎంసీఎల్ఆర్ తీరు..

- ఒక్కరోజు రుణాలపై ఎంసీఎల్ఆర్ 8 శాతం నుంచి 8.10 శాతానికి..
- నెల, మూడు నెలల కాలపరిమితి రుణాలపై వడ్డీరేటు 8.20 శాతం నుంచి 8.30 శాతానికి
- ఆరు నెలల కాలపరిమితి రుణాలపై ఎంసీఎల్ఆర్ 8.55 శాతానికి పెంచింది. అంతకుముందు ఇది 8.45 శాతానికి..
- ఏడాది రుణాలపై ఎంసీఎల్ఆర్ 8.55 శాతం నుంచి 8.65 శాతానికి సవరించింది
- రెండేండ్ల కాలపరిమితి రుణాలపై రేటు 8.75 శాతం నుంచి 8.85 శాతానికి పెంచింది.
- మూడేండ్ల రుణాలపై ఎంసీఎల్ఆర్ 8.85 శాతం నుంచి 8.95 శాతానికి సవరించింది.

బ్యాంక్ బేస్ రేటు

10.40 శాతంగా నిర్ణయించింది.

ఎంసీఎల్ఆర్ అంటే

మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్(ఎంసీఎల్ఆర్) కంటే తక్కువ వడ్డీరేటుకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులకు అవకాశం లేదు.

10 వేల మంది నియామకాలను వాయిదావేసిన కంపెనీలు

ఫ్రెషర్లకు ఐటీ సంస్థల దెబ్బ!

న్యూఢిల్లీ, జూన్ 15: దేశీయ ఐటీ సంస్థలు గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ దేశాలపై ఆర్థిక మాంద్యం పిడుగుపడటంతో ఐటీ సంస్థలు నిర్వహణ ఖర్చులను తగ్గించుకోడానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. ఇప్పటికే పలు ఉద్యోగులను తొలగించిన సంస్థలు..తాజాగా క్యాంపస్‌ల నుంచి రిక్రూట్ చేసుకున్న ఉద్యోగులకు నియామకాలను నిలిపివేశాయి. దేశీయ ఐటీ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, ఎల్‌టీఐమైండ్‌ట్రీ, జెన్సర్‌లు ఏకంగా 10 వేల మంది ఫ్రెషర్లకు మొండిచెయ్యి చూపించాయి సంస్థలు. ఆన్ బోర్డింగ్‌లోవున్న ఉద్యోగులకు నిరాశతప్పటం లేదని నాస్కాంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనేట్(ఎన్ఐటీఈఎస్) విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. దేశీయ టాప్ ఐటీ సంస్థల్లో ఉద్యోగం వచ్చిందని సంబరపడుతున్న ఫ్రెషర్ల ఆశలు గండికొడుతున్నాయని ఎన్ఐటీఈఎస్ ప్రెసిడెంట్ హర్పీత్ సింగ్ సాలుజా తెలిపారు. ముఖ్యంగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రోలో ఉద్యోగుల సంఖ్య సంయుక్తంగా 64 వేల వరకు తగ్గాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 50 వేల మంది ఫ్రెచర్లను నియమించుకున్న ఇన్ఫోసిస్..ఈసారి 11,900 మందిని మాత్రమే రిక్రూట్ చేసుకున్నది. రెండేండ్ల క్రితం భారీ స్థాయిలో సిబ్బందిని రిక్రూట్ చేసుకోనున్నట్లు ప్రకటించిన సంస్థలు ప్రస్తుతానికి వెనుకంజవేస్తున్నాయి. అంతర్జాతీయ క్లయింట్లు ఖర్చులు తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనివ్వడం కూడా రిక్రూట్‌మెంట్లకు బ్రేక్‌పడినట్లు అయింది. అంతర్జాతీయ ఆర్థిక రంగంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా ఈ సారి ఎంత మందిని ఫ్రెషర్లను తీసుకునేదానిపై ఇంకా స్పష్టత రాలేదని ఐటీ ప్రతినిధి ఒకరు చెప్పారు. 2022లో మొత్తం రిక్రూట్‌మెంట్లలో 3-5 శాతం వరకు ఫ్రెషర్లను నియమించుకున్న టాప్ ఐటీ సంస్థలు.. ఇప్పటి వరకు వారికి ఎలాంటి రోల్‌ను అప్పగించలేదని టీమ్‌లీజ్ వెల్లడించింది. ప్రాజెక్టులు తగ్గుముఖం పట్టడం, ఫ్రెషర్లలో ప్రతిభ లేకపోవడం కూడా ప్రధాన కారణాలని పేర్కొంది. టీసీఎస్‌లో 2021-22లో 59 శాతంగా ఉన్న యువ ఉద్యోగుల వాటా గత ఏడాది 50.3 శాతానికి తగ్గింది.

నెక్సస్ సరికొత్త ఈ-స్కూటర్

చెన్నై, జూన్ 15: దేశీయ మార్కెట్లోకి సరికొత్త ఫ్యామిలీ ఎలక్ట్రిక్ స్కూటర్ యాంపిర్ నెక్సస్‌ను పరిచయం చేసింది గ్రేవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ సంస్థ. చెన్నై షోరూంలో ఈ స్కూటర్ ధర రూ.1,09,900. ఈ సందర్భంగా కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో కే విజయ కుమార్ మాట్లాడుతూ..30 శాతం అధిక బ్యాటరీ లైఫ్, మరింత పవర్‌ఫుల్‌తో తీర్చిదిద్దిన ఈ స్కూటర్ నాలుగు రంగుల్లో లభించనున్నదన్నారు. ప్రస్తుతానికి చెన్నైలో లభించనున్న ఈ స్కూటర్ దశలవారీగా దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పొదుపు ట్రెండ్ మారుతున్నది..

- చేతిలో డబ్బులు ఉంచుకునేందుకు ప్రజల ఆసక్తి
- మారుతున్న సేవింగ్స్ పద్ధతులపై హోం క్రెడిట్ అధ్యయనం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 15 (నమస్తే తెలంగాణ): నాభి నిండితే నవాబుకైన జవాబు చెప్పొచ్చు అనేది పాత సామెతగా మారింది. జేబు నిండుగా పైసలు ఉంటే నవాబులాగైనా బతకొచ్చనేది నేటి విధానంగా... పొదుపు విధానంలో మార్పు వస్తున్నది. ఇటీవల కాలంలో మెట్రో నగరాల్లో నివసించేవారు పొదుపు చేసే పద్ధతిని మార్చుకుంటున్నారు. తాజాగా హోం క్రెడిట్ సంస్థ చేసిన అధ్యయనంలో చేతిలో డబ్బులు ఉంచుకోవడమే అసలైన పొదుపుగా భావిస్తున్నట్లుగా తేలింది. గతంలో మాదిరిగా స్టాక్ మార్కెట్లు లేదా డిపాజిట్లు, ఇతర ఆర్థిక మార్గాల్లో పెట్టుబడి పెట్టిన వాళ్లే... ఇప్పుడు వాటన్నింటికంటే చేతిలో డబ్బులు ఉంచుకోవడమే సురక్షితమని అనుకుంటున్నట్లుగా తన నివేదికలో వెల్లడించింది. ఒకవైపు సైబర్ నేరాలు, మరోవైపు స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలతో పొదుపు విషయంలో జనాభిప్రాయం మారుతున్నదని అధ్యయనంలో తేలింది. సంపాదించిన పైసలు కళ్ల ముందర ఉండటమే మంచిదనే భావన ఎక్కువైపోయింది. ఆన్‌లైన్ మోసాలు, నష్టాల భయం కారణంగా డబ్బులను ఇతర మార్గాల్లో పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజవేస్తున్నారు. పాత కాలంలో మాదిరిగా సంపాదించిన డబ్బులను ఇంట్లో నిల్వ చేసుకునే విధానం ఇటీవల కాలంలో భారీగా పెరిగిందనీ చెబుతున్నారు. దేశంలోని అన్ని మెట్రో నగరాలను ప్రామాణికంగా తీసుకుని చేసిన అధ్యయనం ద్వారా మెజార్టీ జనాలు క్యాష్ సేవింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా స్పష్టమైంది. చేతిలో డబ్బులు ఉంటేనే ఆర్థిక స్వతంత్రత, సాధికారికతగా భావిస్తున్నారు. ఈ తరహా ఆలోచన ధోరణి మహిళల్లో ఎక్కువగా ఉండేదని, కానీ మగవారు కూడా ఇదే తరహా పొదుపు మంచిదనే భావనతో ఉన్నారు.

దక్షిణాదిలోనూ ఎక్కువే..

దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో డబ్బులను పొదుపు చేస్తున్న వారిలోనే ఎక్కువగా దక్షిణాదికి చెందినవారని తెలిపింది. ఇందులో మహిళలు ముందు వరుసలో ఉండగా.... ఇటీవల కాలంలో 39 శాతం మంది పురుషులు కూడా క్యాష్ రూపంలోనే సేవింగ్ చేస్తున్నట్లుగా వెల్లడ